క్లుప్తంగా

ఘనంగా ఫిజియోథెరపీ దినోత్సవం



మధురానగర్(విజయవాడసెంట్రల్):ఎటువంటి దుష్ఫలితాలు లేకుండా అన్నిరకాల నొప్పులను ఫిజియోథెరపీతో తగ్గించవచ్చునని ప్రముఖ న్యూరో ఫిజియోథెరపిస్టు డాక్టర్ ఎం.ప్రభుదాస్ పేర్కొన్నారు. స్థానిక సత్యనారాయణపురంలోని స్టార్ ఫిజియోథెరపీ సెంటర్‌లో సోమవారం ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని నిర్వహించారు. కేట్ కట్‌చేసి మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. ప్రజలకు ఉచితంగా ఫిజియోథెరపీ సేవలు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక న్యూరో సమస్యలను సైతం ఫిజియోథెరపీతో తగ్గించే అవకాశం ఉందన్నారు. న్యూరో మందులు వాడుతూ వైద్యుల సలహా మేరకు ఫిజియోథెరపీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫిజియోథెరపీ వైద్యులు వై.రవికుమార్, కె.దుర్గాప్రసాద్, ఇ.సందీప్, జె.చైతన్యరెడ్డి, పి.పూర్ణిమ ప్రసంగించారు.

విద్యతోనే సమాజాభివృద్ధి



మధురానగర్(విజయవాడసెంట్రల్):అక్షరాస్యత అంటే కేవలం అక్షరజ్ఞానం కాదని... ఆలోచించే శక్తి అని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు తమ జ్ఞానాన్ని సమాజ సేవకు వినియోగించాలన్నారు. అందరూ చదువుకునేలా ప్రోత్సహించాలని కోరారు. కళాశాల అర్థశాస్త్ర విభాగపతి ఎన్.జాన్‌సుకుమార్ మాట్లాడుతూ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా చదువు జ్ఞానదీపాన్ని వెలిగించడంతోపాటు సమాజంలో సానుకూల మార్పుకు దోహదపడుతుందన్నారు. ప్రతి విద్యార్థి చదువుతోపాటు విలువలతో కూడిన జ్ఞానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శుభ, సుధాకర్, నారాయణరావు, చరిత, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పికిల్ బాల్ చాంపియన్ షిప్‌లో సత్తా చాటిన రైల్వే అధికారులు



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఏపీ పికిల్ బాల్ చాంపియన్‌షిప్‌లో దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ అధికారులు సత్తా చాటారు. ఈ నెల 6, 7 తేదీల్లో విజయవాడలో జరిగిన 2వ ఏపీ పికిల్ బాల్ చాంపియన్‌షిప్–2025 టోర్నమెంట్‌లో అండర్ 14 నుంచి 60ప్లస్ కేటగిరీల్లో మెన్స్, ఉమెన్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో పోటీలు జరిగాయి. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన టోర్నమెంట్‌లో 50ప్లస్ సింగిల్ విభాగంలో రైల్వే ఆఫీసర్స్ క్లబ్‌కు ప్రాతినిధ్యం వహించిన విజయవాడ డివిజన్‌లోని సీనియర్ డీఈ (బ్రిడ్జి లైన్) పి.శ్రీనివాసరావు తృతీయ స్థానం సాధించారు. డబుల్స్ విభాగంలో రైల్వే హాస్పటల్ ఏసీఎంఎస్ డాక్టర్ రవికాంత్‌తో కలసి ఆయన 4వ స్థానాన్ని సాధించారు. ప్రతిభ ప్రదర్శించిన విజేతలకు పలువురు అధికారులు, ఉద్యోగులు అభినందించారు.

ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభం



పాయకాపురం(విజయవాడరూరల్): విలేజి కండ్రిక లో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్ చుట్టూ 280 మీటర్లు ప్రహరీ నిర్మాణానికి సోమవారం కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మ శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రహరీ నిర్మాణం కోసం నగర పాలక సంస్థ రూ.48లక్షలు మంజూరు చేసినట్లు వివరించారు. వీఎంసీ డీఈ లక్ష్మీ సింధూర, ఏఈ మాధవ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నయవంచనకు కేరాఫ్ చంద్రబాబు

మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మాజీఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, నాయకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్):మోసం, దగా, నయవంచనకు కేరాఫ్ సీఎం చంద్రబాబు అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త మల్లాది విష్ణు విమర్శించారు. ఎన్నికలలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండానే సూపర్ సిక్స్ సూపర్ హిట్ అని చెప్పుకోవడం సీఎం చంద్రబాబుకే చెల్లిందని ఎద్దేవా చేశారు. స్థానిక 31వ డివిజన్ ముత్యాలంపాడు దేవాలయం వీధిలో సోమవారం 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' క్యూఆర్ కోడ్‌ను మల్లాది విష్ణు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పథకాలు, సంక్షేమం, రేషన్‌ను గడప వద్దకే అందించామని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వంలో ప్రతీ పనికీ ప్రజలు క్యూలైన్‌లో నిలబడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు.

నిషేధిత జాబితాలోంచి తొలగించాం..

2014లో టీడీపీ ప్రభుత్వం ముత్యాలంపాడును 22ఏలో చేర్చడంతో ఇక్కడ ప్రజలు వారి ఇళ్లు, స్థలాలు క్రయ విక్రయాలు సాగక అవస్థలుపడ్డారని మాజీ ఎమ్మెల్యే విష్ణు గుర్తుచేశారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ముత్యాలంపాడు ప్రాంత సమస్యను అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి 22ఏ జాబితా నుంచి తొలగింపజేసినట్లు వివరించారు. సూపర్‌సిక్స్‌లో భాగంగా రైతులకు ఏడాదికి రైతులకు రూ. 20వేలు ఇస్తామని చెప్పిన చంద్రబాబు కేవలం రూ.5వేలు మాత్రమే వేశారని విమర్శించారు .అలాగే ఆడబిడ్డ నిధి పథకం ఏమైందని ప్రశ్నించారు. ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులను చెల్లించకపోవడంతో పేద విద్యార్థులు ఇబ్బందులుపడుతున్నారన్నారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటుకు అప్పగించడం ద్వారా కూటమి ప్రభుత్వం, పేదలకు వైద్యవిద్యను దూరం చేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు.

రైతులు కష్టాలలో ఉంటే..ఉత్సవాలు చేస్తారా..?

పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బందిపడుతుంటే, సీఎం చంద్రబాబు రాష్ట్రంలో ఉత్సవాలు చేస్తామని చెప్పడం విచారకరమని విష్ణు పేర్కొన్నారు. అలాగే దేవాలయానికి చెందిన రూ.40 కోట్లు విలువచేసే స్థలంను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు అందినకాడికి దండుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని దుయ్యబట్టారు. రైతులకు సరిపడిన మేర యూరియా అందక ఆయా దుకాణాల వద్ద క్యూలైన్లు కనిపిస్తుండగా, యూరియా కొరతలేదని సీఎం చంద్రబాబు నిసిగ్గుగా ప్రకటిస్తుండటం ఆయన మోసకారితనానికి నిదర్శనంగా పేర్కొన్నారు. రైతులకు అండగా ఉండేందుకు మంగళవారం నందిగామలో తలపెట్టిన 'అన్నదాత పోరు' కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ మాట్లాడుతూ చంద్రబాబు కూటమి మోసాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రజలకు తాము అండగా ఉండి వారి తరపున పోరాటం సాగిస్తామని వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శర్వాణీ మూర్తి, క్లస్టర్ ఇన్‌చార్జి బోగాది మురళి, వైఎస్సార్‌సీపీ నాయకులు పి.పట్టాభిరామరాజు, సామంతపూడి చిన్నా, టి.మురళీ కృష్ణంరాజు, ఆకెళ్ళ శ్రీనివాసరావు, కడవకొల్లు వెంకటేశ్వరరావు, జయకర్, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

బార్‌ను తొలగించాలని వినతి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నివాసాల మధ్యలో ఉన్న బార్‌ను తొలగించాలంటూ ఐద్వా సెంట్రల్ సిటీ కార్యదర్శి జి.ఝాన్సీ సోమవారం ఎక్సైజ్‌శాఖ సూపరిండింటెంట్ కలిసి కోరారు. ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్ నుంచి లెనిన్‌సెంటర్‌కు వెళ్లే మార్గంలో ఉన్న రూపలక్ష్మీసాయి రెస్టారెంట్ అండ్ బార్ వద్ద నిత్యం మందుబాబులు రోడ్లపై చేరి అసభ్యకరంగా ఉంటుండటంతో రాకపోకలకు మహిళలు, విద్యార్థినులు ఇబ్బందిపడుతున్నారన్నారు. రైతుబజార్‌కు వెళ్లేందుకు కూడా ఇబ్బందిగా ఉందన్నారు. విద్యార్థినులు, మహిళల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బార్‌కు అనుమతి ఇవ్వకుండా చూడాలని కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో ఐద్వా నాయకులు ఎస్‌కే షకీలా, ఎస్‌కే ఆష, జి.సుజాత ఉన్నారు.

కలెక్టర్ సార్.. కాపాడండి

పీజీఆర్ఎస్‌లో ఓ బాలుడి ఆవేదన



తనతల్లితో కలిసి పీజీఆర్ఎస్ వద్ద పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న భార్గవరాజ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కలెక్టర్ సార్ ప్లీజ్...మా నాన్న, బాబాయ్‌ల నుంచి ఆస్తి, ప్రాణాలు కాపాడాలంటూ పద్నాలుగేళ్ల బాలుడు ఓ చేత ఫ్లెక్సీ, మరో చేత తండ్రి నివాసం ఉంటున్న ఇంటి ఫోటోతో కలెక్టరేట్‌లో ప్రదర్శన చేశాడు. విజయవాడ విద్యాధరపురం నాలుగుస్తంభాల సెంటర్‌కు చెందిన పాగోలు భార్గవ్‌రాజ్ తనతల్లి అరుణతో కలిసి సోమవారం కలెక్టర్‌కు తన గోడు చెప్పుకునేందుకు కలెక్టరేట్‌కు వచ్చాడు. చేతిలో ఫ్లెక్సీతో కనిపించడంతో మీడియా అతనిని పలుకరించింది. ఈ సందర్భంగా బాలుడు భార్గవరాజ్ తనగోడు వెళ్లబోసుకున్నాడు.

గొడవల కారణంగా తన తల్లిదండ్రులు పాగోలు విజయ్‌భాస్కర్, అరుణ విడివిడిగా ఉంటున్నారన్నారు. 9వతరగతి చదువుతున్న తాను అమ్మతో కలిసి అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటున్నానని తెలిపాడు. మెయింటెనెన్స్ కింద తల్లికి తనకు కలిపి నెలకు రూ.50వేలు ఇవ్వాలని కోర్టు ఆదేశించినప్పటికీ ఆ ఆదేశాలను తనతండ్రి ఏడాదిన్నరగా ఇవ్వకపోతుండటంతో ఇబ్బందిపడుతున్నట్లు వాపోయాడు. అదేమని అడిగితే జైలుకు వెళతాను కానీ ఒక్క రూపాయి కూడా ఇవ్వను అంటున్నాడని తెలిపాడు. మెయింట్‌నెన్స్ ఇవ్వకపోతే బతికేదెలా అని ఆవేదన వ్యక్తంచేశారు. తన తండ్రికి వీరులపాడు మండలం జయంతి గ్రామంలో 4.86ఎకరాలు. ప్రకాశం జిల్లా బెస్తవారిపాలెంలో 5ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా కోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత ఆ ఆస్తిని తనతండ్రి ఆయన సోదరుడైన ప్రవీణ్ పేర రిజిస్ట్రేషన్ చేయించాడన్నారు. కేవలం మెయింటెనెన్స్ ఎగ్గొంటేందుకు ఇలా చేశాడంటూ కన్నీటి పర్యంతమయ్యాడు. నాన్న బాబాయ్‌ల నుంచి ఆస్తిని, తన ప్రాణాలను కాపాడాలని పీజీఆర్ఎస్‌లో జేసీ ఇలక్కియాను కలిసి అర్జీ అందజేశాడు. బాబాయ్ ప్రవీణ్ పేర బదిలీ చేసిన ఆస్తి రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని, మెయింట్‌నెన్స్ ఇప్పించాలని ఆ అర్జీలో కోరాడు.

19, 20 తేదీల్లో గ్రీన్ హైడ్రోజన్‌పై సదస్సు



లబ్బీపేట(విజయవాడతూర్పు): గ్రీన్ హైడ్రోజన్.. భవిష్యత్తు ఇంధనంపై శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలలో ఈ నెల 19, 20 తేదీల్లో సదస్సు నిర్వహించనున్నారు. కళాశాల రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న సదస్సు పోస్టర్స్‌ను సోమవారం ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎస్ కుమార్, రసాయనశాస్త్ర విభాగాధిపతి కల్పన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ రెండు రోజులు నిర్వహించే సదస్సులో గ్రీన్ హైడ్రోజన్ ఉపయోగం భవిష్యత్తులో ఎంతగా ఉందో తెలియజేయనున్నట్లు తెలిపారు. దీన్ని ఎలా తయారు చేస్తారు, నిల్వ చేయడం రవాణా అనే అంశాలపై దేశ, విదేశాల నుంచి విచ్చేసే నిష్ణాతులు వివరించనున్నట్లు పేర్కొన్నారు. డిగ్రీ, పీజీ విద్యార్థులకు గ్రీన్ హైడ్రోజన్ ఉపయోగాలపై అవగాహన కలిగించనున్నామని చెప్పారు. కార్యక్రమంలో రసాయన శాస్త్ర ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా చక్రవర్తి జయంతి వేడుకలు



చక్రవర్తి జయంతి వేడుకల్లో పాల్గొన్న ఆయా సంస్థల ప్రతినిధులు

విజయవాడ కల్చరల్: సుస్వరాల సంగీత దర్శకుడు చక్రవర్తి అని విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్‌రాజు కొనియాడారు. డ్రీమ్ ఆడియో ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా కళావేదికమీద సినీ సంగీత దర్శకుడు చక్రవర్తి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా డేవిడ్‌రాజు మాట్లాడుతూ చక్రవర్తి ఎన్నోవిజయవంతమైన చిత్రాలకు దర్శకత్వం వహించి అత్తుతమ సినీగీతాలను అందించారని కొనియాడారు. పలు తెలుగు చిత్రాలలో నటించి ప్రేక్షకులను మెప్పించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాస్తి వీరాంజనేయులు, నాయుడు, చిట్టిబాబు, డి.వీరభద్రరావు, రమేష్ పాల్గొన్నారు. అనంతరం గాయనీగాయకులు వి.శ్రీనివాస్, ఎ.సాంబశివరావు, సత్యనారాయణ, ఆర్.వసంత్, శిరీష, మల్లీశ్వరి, సీహెచ్ నరసింహారావు కలిసి చక్రవర్తి రూపకల్పన చేసిన పలు సినీగీతాలను ఆలపించారు. అనంతరం నిర్వాహకులు గాయనీగాయకులను సత్కరించారు.

తాగునీటి సరఫరాలో అంతరాయం

పటమట(విజయవాడతూర్పు): కాశేశ్వరరావు మార్కెట్ సమీపంలోని లోబ్రిడ్జి వద్ద ఉన్న 16 ఎంజీడీ 900 మిమి పీఎస్సీ పంపింగ్ మెయిన్‌లైన్ మరమ్మతులకు గురైందని, రిపేరు చేసే క్రమంలో నగరంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం నుంచి 10 తేదీ ఉదయం వరకు పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. గాంధీనగర్, హనుమాన్‌పేట, సత్యనారాయణపురం, దుర్గాపురం, గులాబీతోట, మధురానగర్, శ్రీనగర్ కాలనీ, భానునగర్, టీచర్స్‌కాలనీ, ముత్యాలంపాడు, గవర్నర్‌పేట, అరండల్‌పేట, సూర్యారావుపేట, కస్తూరిబాయిపేట, గిరిపురం, దుర్గాగ్రహారం, సీతారామపురం, బాడవపేట, ఉడ్డుపేట, లబ్బీపేట, మల్లికార్జునపేట, కేదారేశ్వరరావుపేట, పూర్ణానందంపేట, పెజ్జోనిపేట, లోటస్, రామలింగేశ్వరపేట, అయోధ్యనగర్, శాంతినగర్, ఉప్పరవాగు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా ఉండదని వివరించారు.

సౌకర్యాల కల్పనపై నిరంతర పరిశీలన

వీఎంసీ అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) చంద్రశేఖర్



పీజీఆర్ఎస్ సమస్యలను తెలుసుకుంటున్న వీఎంసీ అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్

పటమట(విజయవాడతూర్పు): నగర ప్రజలకు వీఎంసీ కల్పిస్తున్న సౌకర్యాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా అధికారులు నిరంతర పరిశీలన చేయాలని వీఎంసీ అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్)డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో జరిగిన ప్రజా ఫిర్యాదులు–పరిష్కార కార్యక్రమంలో ఆయన నగరవాసుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. శాఖల మధ్య సమన్వయంలోపం లేకుండా ఫిర్యాదుదారుడికి సంతృప్తికరమైన పరిష్కారం అందించాలన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 7 ఫిర్యాదులు అందగా అందులో పట్టణ ప్రణాళికపై 3, ఇంజినీరింగ్ 2, రెవెన్యూ1, ఎస్టేట్ 1 ఫిర్యాదులను అందుకున్నారు. చీఫ్ ఇంజినీర్ ఆర్. శ్రీనాథ్‌రెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జున రావు, డెప్యూటీ డైరెక్టర్ (హార్టికల్చర్) చంద్రశేఖర్, ఎస్టేట్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పిన్న వయసు..పెద్ద మనసు

దొరికిన పర్సును పోలీసులకు అప్పగించిన 5వ తరగతి విద్యార్థి



బాధితురాలికి పర్సును అందచేస్తున్న వెంకటేష్, సీఐ కొండలరావు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రోడ్డుపై దొరికిన పర్సును బాధితులకు అందజేయాలని ఆ చిన్నారి నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి అధికారులకు అప్పగించాడు. చిన్నారి పెద్ద మనసును కొత్తపేట సీఐ కొండలరావుతో పాటు స్టేషన్ అధికారులు అభినందించారు. కొత్తపేటలోని తేల్రప్రోలు రాజా స్కూల్‌లో దల్లి వెంకటేష్ 5వ తరగతి విద్యార్థి. సోమవారం స్కూల్‌కు వెళ్లిన వెంకటేష్‌కు శ్రీనివాసమహల్ వద్ద రోడ్డుపై పర్సు కనిపించింది. అందులో కొంత నగదుతో పాటు ఐడీ కార్డు ఉండటంతో చుట్టూ చూడగా అక్కడ ఎవరూ కనిపించలేదు. దీంతో వెంటనే వాగు సెంటర్‌లోని పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. తనకు రోడ్డుపై దొరికిన పర్సు గురించి చెప్పి పోలీసులకు ఆ పర్సు అందించారు. సీఐ కొండలరావు వెంకటేష్‌ను పిలిచి మాట్లాడి పర్సులో ఏం ఉన్నాయని పరిశీలించారు. రూ. 14 వేలు నగదు ఉన్నట్లు గుర్తించి ఐడీ కార్డులో ఉన్న మహిళకు సమాచారం అందించారు. వాగు సెంటర్‌కు చెందిన [illegible] కమల కుమారికి చిన్నారి వెంకటేష్ సమక్షంలోనే పర్సును అందించారు. [illegible] పర్సును బాధితురాలికి చేర్చిన వెంకటేష్‌ను అందరూ అభినందించారు.

ద్విచక్రవాహనం ఢీకొని గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మితిమీరిన వేగంతో వచ్చిన బైక్ ఢీకొట్టడంతో ఒకరు గాయపడిన ఘటన కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేఎల్‌రావునగర్ కుండల మార్కెట్ ప్రాంతానికి చెందిన జగదీశ్వరి, శివనాగకుమార్ భార్యాభర్తలు. నాగకుమార్ ఇసుక, కంకర, ఇటుక వ్యాపారి. ఈ నెల 6వ తేదీన చిట్టినగర్‌లోని టీ స్టాల్‌లో టీ తాగి వస్తున్న నాగకుమార్‌ను కట్టా షణ్ముక శ్రీనివాస్ బైక్‌పై వేగంగా వచ్చి ఢీ కొట్టాడు. నాగకుమార్ గాయపడగా వెంటనే విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న కొత్తపేట పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేశారు.

ఫిజియోథెరపీతో అనేక ప్రయోజనాలు



ఫిజియోథెరపీ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న వైద్యులు, ఫిజియోథెరపిస్టులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):ఫిజియోథెరపీలో తాజాగా వచ్చిన సాంకేతికత, నూతన పరిశోధనలపై ఫిజియోథెరపిస్టులు అవగాహన పెంచుకోవాలని ఫిజియోథెరఫి విభాగాధిపతి డాక్టర్ అనుపమ సూచించారు. అంతర్జాతీయ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం సిద్ధార్థ మెడికల్ కళాశాల క్రీడా ప్రాంగణంలో న్యూ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్(జీజీహెచ్) ఫిజియోథెరపీ విభాగం ఆధ్వర్యంలో ఫిజియోథెరపిస్టులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఫిజియోథెరపీ ఇంటర్న్‌షిప్ విద్యార్థులకు క్విజ్ పోటీలు, సీనియర్ ఫిజియోథెరఫిస్టులచే అధునాతన ఫిజియోథెరపీ వైద్యవిధానాలపై అవగాహన కల్పించారు. క్రీడాపోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. రోగులకు ఫిజియోథెరపీపై అవగాహన కార్యక్రమాన్ని డాక్టర్ కిరణ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనుపమ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాలకు బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపిని మాత్రమే విద్యార్హతగా రాష్ట్రప్రభుత్వం ప్రకటించిందని, పారామెడికల్ విభాగం కింద ఉన్న ఫిజియోథెరపిని అలైడ్ హెల్త్ సైన్స్ కిందకు మార్చినట్లు వివరించారు. ఫిజియోథెరపి విభాగ ఇన్‌ఛార్జి కిరణ్ మాట్లాడుతూ ప్రస్తుత జీవన విధానం కారణంగా యువత నుంచి వృద్ధుల వరకు ఎదుర్కొంటున్న అనారోగ్యసమస్యల నివారణలో ఫిజియోథెరపీ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. ఫిజియోథెరపీతో కలిగే ప్రయోజనాలను వివరించాచరు. ఆసుపత్రి సూపరింటెండెంట్ ఏవీ రావు మాట్లాడుతూ ఫిజియోథెరపీ రంగ ప్రాముఖ్యత గణనీయంగా పెరుగుతోందన్నారు. నొప్పుల నివారణలో ఫిజియోథెరపీ కీలకంగా మారిందన్నారు. కార్యక్రమంలో న్యూరో సర్జరీ విభాగాధిపతి శ్యాం బాబ్జీ, ఆర్థో విభాగాధిపతి ఎ.శ్రీనివాస్, డాక్టర్ పద్మావతి తదితరులు మాట్లాడుతూ ఫిజియోథెరపీ రంగంలో వైద్యులు, వైద్యవిద్యార్థులు తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

దసరా ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు గ్రామదేవత శ్రీగంగానమ్మ అమ్మవారి దేవాలయంలో ఈనెల 22వ తేదీ నుంచి వచ్చేనెల 3వ తేదీ వరకు దసరా నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రధానకార్యదర్శి మందపాటి యుగంధర్ వర్మ తెలిపారు. స్థానిక శ్రీగంగానమ్మ దేవాలయంలో సోమవారం దసరా నవరాత్రి ఉత్సవాల కరపత్రాలను కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు ఈనెల 22వ తేదీన శ్రీబాలాసహిత స్వర్ణకవచాలంకృత గంగానమ్మతల్లి, 23న శ్రీవారాహిదేవి, 24న శ్రీఅన్నపూర్ణాదేవి, 25న శ్రీమహాలక్ష్మీదేవి, 26న శ్రీశివకామసుందరీదేవి, 27న శ్రీభగళాముఖీదేవి, 28న శ్రీమహాచండీదేవి, 29న శ్రీసరస్వతీదేవి, 30న శ్రీదుర్గాదేవి, అక్టోబర్ 1వ తేదీన శ్రీకాళికాదేవి, 2న శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారన్నారు. 2వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు ముత్యాలంపాడు పురవీధులలో అమ్మవారి ఊరేగింపు, 3వ తేదీ శుక్రవారం లోక కళ్యాణార్థం చండీహోమం నిర్వహిస్తామని వివరించారు. ప్రతిరోజూ అమ్మవారికి కుంకుమార్చనలు, లలితా సహస్రనామ పారాయణం, కె.రామారావు బృందంచే నాదస్వరం, మంగళవాయిద్య కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని భక్తులను కోరారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు కళ్ళేపల్లి భూపాలరాజు, గొడవర్తి నరేంద్రవర్మ, ఉప్పలపాటి మురళీకృష్ణంరాజు, ఉప్పలపాటి సత్యనారాయణరాజు, భక్తులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ముత్యాలంపాడులో పూజలు చేస్తున్న భక్తులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మూసివేసిన దేవాలయాల్లో సోమవారం ఉదయం ఆలయ అర్చకులు సంప్రోక్షణ నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి దర్శనానికి భక్తులను అనుమతించారు. ముత్యాలంపాడులోని శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు గ్రహణ స్నానం ఆచరించి ఆలయాలకు చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయకమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

బుడమేరు బాధితులను ఆదుకోవాలి : సీపీఎం



వరదలకు దెబ్బతిని కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న ఇంటి శ్లాబును పరిశీలిస్తున్న సీపీఎం నేత బాబూరావు

పాయకాపురం(విజయవాడరూరల్): గతేడాది బుడమేరు వరదలతో దెబ్బతిన్న ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం రూ. 5లక్షలు అందించి బాధితులను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు డిమాండ్ చేశారు. బుడమేరు వరదలకు 64వ డివిజన్ నేతాజీ సుభాష్ చంద్రబోస్ నగర్,కండ్రిక కాలనీలలో దెబ్బతిన్న ఇళ్లను సోమవారం ఆయన పరిశీలించారు. పాఠశాలలు, ఆసుపత్రులు, రోడ్లు, కాలువలను సైతం పరిశీలించారు.

వరద బీభత్సంతో రోజుల తరబడి నీరు ఇళ్లలో ఉండటంతో ఇళ్లు దెబ్బతిని పెచ్చులూడుతున్నాయని స్థానికులు ఆయన ఎదుట వాపోయారు. వరదల కారణంగా నష్టపోయిన, అనారోగ్యానికి గురైన మృతిచెందిన వారికి ఎటువంటి పరిహారం అందలేదని బాధితులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈసందర్భంగా బాబూరావు మాట్లాడుతూ కండ్రిక కాలనీలో పాపారావు అనే వ్యక్తి వరదలలో గాయపడి మూడు నెలల్లోనే మరణించారని, ఆ కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందలేదని గుర్తుచేశారు. దెబ్బతిన్న నగరపాలక సంస్థ పాఠశాల భవనాలను వీఎంసీ మరమ్మతులు చేయించలేదన్నారు. బుడమేరు వరద ముంపు నివారణకు శాశ్వత చర్యలు తీసుకోలేదన్నారు. మరోవైపు దెబ్బతిన్న ఇళ్ల పునర్నిర్మాణానికి నిధులు కేటాయించకపోవడం శోచనీయమన్నారు. ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం అందిస్తామని ముఖ్యమంత్రి ప్యాకేజీలో ప్రకటించినా, ఇప్పటికీ సహాయం అందకపోవడం గర్హనీయమన్నారు. మృతిచెందిన కుటుంబాలకు కూడా ఆర్థికసాయం అందించలేదన్నారు. బాధితులను ఆదుకోవడంతో కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ఇకనైనా ప్రభుత్వాలు స్పందించి బుడమేరు వరద బాధితులను ఆదుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు సిహెచ్ శ్రీనివాస్, పి.వెంకటరెడ్డి, రమేష్, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో అనర్థాలపై అవగాహన

పటమట(విజయవాడతూర్పు): నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో పటమటలంకలోని కొమ్మా సీతారామయ్య జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగంతో కలిగే నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ శేఖర్‌బాబు మాట్లాడుతూ మత్తుతో విద్యార్థుల భవిత అంధకారమవుతుందని మత్తు పదార్థాల వినియోగంతో శారీరక, మానసిక రుగ్మతలు తలెత్తుతాయన్నారు. ఎవరైనా మత్తుపదార్థాలకు బానిసలుగా మారితే వారిని నూజివీడు మండలం పొలసానపల్లిలో ఏర్పాటు చేసిన 'బోస్కో డీ అడిక్షన్ కేంద్రంలో చేర్పించవచ్చన్నారు. మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్లు జాకబ్ రాజు, ప్రియాంక పాల్గొన్నారు.



సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయవాడ సెంట్రల్ :
90102 01611
Office mail : sakshiads@gmail.com